



# ప్రవృత్తి

– దాసరి అమరేంద్ర

"ప్రయాణం బాగా జరిగిందా" నిజాముద్దీన్ స్టేషన్‌లో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లోంచి దిగుతున్న సరళను సమీపిస్తూ ఆప్యాయంగా అడిగింది సుజాత.

"ఓ.. చాలా బాగా.. దారి పొడవునా ఎంత బావుందనుకున్నావ్.. వర్షాకాలం గదా.. కొండలు, అడవులు, సెలయేళ్ళు, జలపాతాలు– అద్భుతం. ఈ జన్మలో మరచిపోలేను ఈ ప్రయాణాన్ని.." ఇరవైరెండేళ్ళ సరళ ఒక్కసారిగా ఆరేళ్ళ పసిపాప అయిపోయి పరిసరాలను మరచిపోయి పరవశంగా వివరించసాగింది.

"ఆ.. ఆ.. ఆ కబుర్లన్నీ ఇంటికెళ్ళాక చెప్పుకోవచ్చు. నువ్వు రచయిత్రివీ కవయిత్రివీ కాబోతున్నావని తెలుసు కాని ఆ కవిత్వమంతా రైల్వే ప్లాట్‌ఫాం మీద ఒలకబోస్తే మా ఢిల్లీ ప్రజలంతా భయపడిపోతారు. ముందు స్టేషన్ బయట పడదాం పదండి.." కాస్తంత వేళాకోళంగా అన్నాడు రమేష్.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 5.7.96

"చూడక్కా.. బండి దిగీ దిగకముందే బావ రచయిత్రీ కవయిత్రీ అని మొదలెట్టాడు.." బుంగ మూతి పెట్టింది సరళ.

కారాలు పచ్చళ్ళూ పప్పులూ గాబోలు– సామాన్లు దండిగానే వున్నాయి.

"రమేష్.. నాకూ ఓ సామానివ్వండి.." ముందు కొచ్చి అందుకున్నాడతను.

ఎవరతనూ? పరిశీలనగా చూసింది సరళ.

సామాన్యమైన దుస్తులు.. అంటకత్తెర వేసిన జుట్టు.. కాళ్ళకు కాన్వాసు బూట్లు.. వయసు పాతికా ముప్పైల మధ్యన వుండవచ్చు. సాధారణమైన రూపం...

"సరళా.. ఈయన ప్రభాకరనీ.." రమేష్ పరిచయం చేయబోయాడు. ఈలోగా ప్లాట్‌ఫాం మీద ఓ భారీ లగేజీ ట్రాలీ 'సైడ్.. సైడో..' అన్న అరుపులతో బిరబిరా దూసుకువచ్చింది. ఆ జగన్నాథ రథచక్రాల కింద పచ్చడి సీసాలు పడి పచ్చడి పచ్చడి అవకుండా సంభాళించుకునేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.

అంతా తలా ఓ సామాను చేతబుచ్చుకుని స్టేషన్‌నుంచి బయటపడ్డారు.

ఓ మారుతీ దగ్గరకు దారితీశాడు ప్రభాకర్. అన్ని సామాన్లను చకచకా నైపుణ్యంతో ఆ మారుతీ డిక్కీలో సర్దేశాడు.

మారుతీ నిజాముద్దీన్ కాలనీ దాటుకుని మధురా రోడ్‌లోకి ప్రవేశించింది. ఇంకా పూర్తిగా తెల్లవారకపోయినా అప్పుడే రోడ్లమీద వాహనాల సందడి మొదలయిపోయింది.

"సరళా.. ఆ దూరంగా కనబడుతోందే. అదే హుమాయూన్ సమాధి. ఈ ఎడమ చేతివేపున నిజాముద్దీన్ దర్గా వుంది" మొదటిసారి ఢిల్లీ వచ్చిన మరదలికి నగరాన్ని పరిచయం చేయ నారంభించాడు రమేష్.

"రైల్వే స్టేషన్ వున్నయ్ అని ఈ నిజాముద్దీన్‌గారి పేరు ఎవ్వరూ వింటూ వుంటాము. అసలింతకీ ఈ నిజాముద్దీన్ గారెవరు?" అడిగింది సరళ.

ఏం చెప్పాలో తెలియక మొహామొహాలు చూసుకున్నారు సుజాతా రమేషూ.

"పదమూడు పద్నాలుగు శతాబ్దాలలో తొంభై సంవత్సరాలు ఢిల్లీలో జీవించిన సూఫీ వేదాంతి ఆయన. బానిస, ఖిల్జీ, తుగ్లక్ వంశాలు ఢిల్లీని పాలించడం చూశాడు. అల్లావుద్దీన్ ఖిల్జీ, ఘయాసుద్దీన్ తుగ్లక్ ఆయన భక్తులు. ప్రఖ్యాత కవి అమీర్ ఖుస్రో ఆయన శిష్యుడు.." క్లుప్తంగా వివరించాడు డ్రైవర్ సీటులో వున్న ప్రభాకర్.

మారుతీ జూ పార్కుమ దాటుకుని పురానా ఖిల్లా పక్కనుంచి సాగింది. మరికాస్త ముందుకు సాగి సుప్రీంకోర్టు, ప్రగతి మైదాన్‌ల మధ్యనుంచి దూసుకుపోయింది. ఢిల్లీ నగరపు వింతలు విశేషాల గురించి అప్పటికే ఎంతో కొంత తెలుసుకుని వున్న సరళ ఆయా పరిసరాలను ఎంతో శ్రద్ధగా పరిశీలించసాగింది.

అంతా ఐటీవో దగ్గరి యమునా బ్రిడ్జి దాటారు. అప్పటికే వాహనాలతో కిటకిటలాడుతున్న షకర్‌పూర్ రోడ్‌లోకి ప్రవేశించారు. కళ్ళను ఆకట్టుకునే విశేషాలేమీ కనిపించకపోవడంతో సరళ నోటికి పనిచెప్పింది. ఆమె, సుజాత మరిహ ముందు ముందు అవకాశమే దొరకదన్నంత హడావుడిగా.. గోలగోలగా కబుర్లలో పడిపోయారు. అవునుమరి– ఏడాది దాటిపోయింది వాళ్ళిద్దరూ కలిసి– కబుర్లకేం తక్కువా!

ఏకాగ్రత చెదరగా ప్రభాకర్ అసహనంగా ఒకటి రెండుసార్లు వెనక్కి తిరిగి చూశాడు.

సుజాత అది గమనించలేదు. సరళ గమనించినా లెక్కచెయ్యలేదు.

"సుజాతగారూ.. ప్లీజ్" చివరికి అనేశాడతను.

చిరునవ్వుతో మాటలాపింది సుజాత. చిరాగ్గా మొహం పెట్టింది సరళ.

అది గమనించాడు రమేష్. "మా ఢిల్లీలో ట్రాఫిక్ మహాదారుణం. మీరలా కిలకిలలాడితే నడిపే మనిషికి ఇబ్బంది. దృష్టి నిలవదు" సౌమ్యంగా వివరించాడు.

అయినా సమాధానపడలేదు సరళ.

మరో పావుగంట తర్వాత ఢిల్లీ నగరపు తూరుపు శివార్లలో వున్న రమేష్ వాళ్ళ కంపెనీ క్వార్టర్స్ చేరుకున్నది. చుట్టూ పచ్చని చెట్లతో మధ్యలో విశాలమైన పార్కుతో వున్న ఆ చిన్న కాలనీ సరళకు ఎంతగానో నచ్చింది.

"ప్రభాకర్.. ఎంత ఇవ్వమంటారు?" అడిగాడు రమేష్.

"పెట్రోలు ధర పెరిగిందిగదా.. ఈసారి వంద"

"ఆశకు అంతుండాలి.."

"అదేమీ? బయట టాక్సీకన్నా తక్కువే గదా.. అయినా వంద మీకో లెక్కా.."

"ఆ.. ఆ.. పోలికలకేం.. మీలాగా బ్రహ్మచారిగా వుండే రోజుల్లో వంద నోటు చులాగ్గా ఖర్చుపెట్టేస్తూ వుండేవాడిని. పెళ్ళయితే గానీ మా ఇబ్బందులు మీకు అర్థంకావు..." నవ్వుతూ పెద్ద నోటు అందించాడు రమేష్. 'బై' చెప్పి వెళ్ళిపోయాడు ప్రభాకర్.

ఎంత సోషలిస్టు భావాలున్నా బావ ప్రభాకర్‌తో అంత చనువుగా స్నేహంగా వుండడం నచ్చలేదు సరళకి.

* * *

ఉదయం ఆరుగంటల సమయం.

ఢిల్లీలో ఆగస్టు నెలలో పగళ్ళు అసౌకర్యంగా వున్నా ఉదయాలు ఎంతో బావుంటాయి. వర్షాలలో ఓలలాడిన పచ్చని చెట్లు.. కడిగి ఆరబెట్టినట్టుండే చక్కని రోడ్లు.. ఇహ రమేష్ వాళ్ళ కాలనీలలో అయితే చెప్పనక్కర్లేదు. ఏదో సుందరారణ్యంలో పర్ణశాల వేసుకుని వున్నట్టుండి సరళకు. బాల్కనీ కప్పకు వేలాడదీసిన వెదురు ఉయ్యాలలో



## బ్లాక్ డ్రీమ్

పొర్లుతున్న మాటలనుంచి
దూర దూరంగా పరిగెడుతున్నాను
రంగులంటే నీకు భయమని తెల్సిన తర్వాత
ఎర్రటి రక్తం మరిగి నల్లదైంది
చీకటిని చూసి కిటికీలు మూసుకునే
మీ ఆత్మల సాక్షిగా
నాకు ప్రాణం కోల్పోయిన శరీరమ్మీది
నీలిరంగే చివరి ప్రేమికురాలు–

* * *

కంటికింద నీడల ఒడిలో నిద్రించే
నీలాకాశపు కడలిలో మునగడమే
మంటలెత్తుతున్న కలకు ఓదార్పు
కారుతున్న జ్ఞాపకం వెనుక
కూలిపోయిన రంగుల కలల కలవరం
ఇప్పుడిక
అత్తరువాసన అంటని చోటే లేదు
చివరికి
రూప రహిత ప్రేమ కూడా
నల్లటి మచ్చనే ప్రేమిస్తోంది వెర్రిగా...

–ఎం.వి. రమణ

వేడి వేడి టేసీటితోపాటు కరకరలాడే కబుర్లను నంజుకుంటూ ఊగుతూ వుంది సరళ.

"మరి నీ ఎమ్‌సీయే అయిపోయింది కదా.. ఏమిటీ నీ ముందు కార్యక్రమం? ఇక్కడే వుంటావా అమెరికా చెక్కేస్తావా?" అడిగాడు రమేష్.

"అమెరికానా? ఆ ప్రసక్తే లేదు. అసలు నాకు అంత ప్రతిభా లేదు. ఏదైనా మంచి సంస్థలో కంప్యూటర్ భూతాల కోరలు తోమాలని నా ప్లాను."

"ఎక్కడైనా అప్లై చేశావా?"

"ఏదీ.. మొన్ననేగా డిగ్రీ అందుకున్నదీ. అప్లై చెయ్యాలి. అయినా ఎక్కడో ఎందుకూ? మీ ఢిల్లీలోనే ఏదైనా దారి చూపించకూడదూ? అక్కా బావల సేవ చేసుకుంటూ ఆడ లక్ష్మణునిలా మీ చెంత పడివుంటాను.."

ఆలోచనలో పడ్డాడు రమేష్ "నిజమే.. ఇక్కడ ప్రయత్నించవచ్చు. అసలు మా కంపెనీలో కూడా కంప్యూటర్ విభాగం వుంది. కానీ ఖాళీలున్నట్టు లేవు. మాది కాస్త పేరున్న కంపెనీ గాబట్టి ఉద్యోగాలకు గిరాకీ ఎక్కువ. అయినా చూద్దాం. ఢిల్లీలో ఉద్యోగాలకేం తక్కువా.." సాలోచనగా అన్నాడు.

"సర్లెండి. ఇప్పుడు ఉద్యోగానికేం తొందరొచ్చిందీ: మేం ఆరేళ్ళుగా ఢిల్లీలో వుంటున్నాం. ఎంత రమ్మన్నా డిగ్రీ పూర్తయితే గానీ రానని ఇప్పటికి వచ్చావు. కనీసం ఆగ్రా అయినా వెళ్ళిరావద్దూ..." మాట మార్చింది సుజాత.

"అవునవును. వెళదాం. ఈ ఆదివారం వెళదామా" సంబరంగా అన్నది సరళ.

మళ్ళా ఆలోచనలో పడ్డాడు రమేష్ "వెళదాం. ఎలా అయితే బావుంటుంది? టూరిస్టు బస్సా తాజ్ ఎక్స్‌ప్రెస్సా?" సుజాతను సలహా అడిగాడు.

"అవన్నీ ఎందుకూ? మన ప్రభాకర్ మారుతీ బావుండదూ?"

"బావుంది. మంచి ఆలోచన. ఆయనా సంతోషిస్తాడు. తెల్లారుఝామున బయల్దేరితే– ఎంత రెండొందల కిలోమీటర్లే గదా– పది లోపల ఆగ్రా వెళ్ళిపోతాం. మళ్ళీ ఏ నాలుగింటికో ఆగ్రాలో బయల్దేరితే రాత్రి పదింటికల్లా ఇంటికి చేరతాం" రమేష్ మనసులో ఓ విపులమైన ప్రణాళిక అప్పుడే రూపుదిద్దుకుంది.

ఆహ్లాదకరంగా జరిగింది ఆగ్రా యాత్ర. అతిచక్కని ఢిల్లీ ఆగ్రా రోడ్డుమీద సరదాగా ప్రయాణం చేసి అంతా ఎండ ముదిరేలోగా ఆగ్రా చేరుకున్నారు. ఆగ్రా శివార్లలోని అక్బర్ సమాధినీ, నగరపు మొగలోని రాధాస్వామీ సత్సంగ్‌వారి దయాల్బాగ్ మందిరాన్ని చూసుకుని ఆగ్రా ఫోర్ట్ చేరుకున్నారు. ఆ కట్టడాలు ఆ రాజప్రసాదాలు చూసి పరవశించింది సరళ. తాను పాఠ్య పుస్తకాలలోను, చారిత్రక నవలల్లోనూ చదివిన మొగలాయీ సామ్రాజ్య వైభవమంతా కళ్లముందు నిలిచిన దనిపించింది సరళకు. దూరాన కనిపిస్తోన్న తాజ్‌మహల్ దగ్గరకు రెక్కలు కట్టుకుని వాలాలని తహతహలాడింది.

కానీ తాజ్‌మహల్ చూసేసరికి ఉత్సాహం చప్పచల్లారింది. త్రివిక్రముడిని చూద్దామని వెళితే వామనుడు కనిపించినట్టనిపించింది! ఎంతో ఉన్నతంగా ఎవరెస్టు శిఖరంలా మహా అద్భుతంగా వుంటుందనుకున్న తాజ్‌మహల్ సాదాసీదాగా వున్నట్టు కనిపించి కొంచెం నిరుత్సాహం కలిగించింది. పైగా తాజ్‌మహల్ ప్రాంగణంలోంచి శ్రీశ్రీ గొంతు 'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' అని నిలదీస్తోన్న అనుభూతి. నవ్వొచ్చింది సరళకు– అసలీ ఉత్సాహ నిరుత్సాహాలకు మూలకేంద్రం మన మనస్సే కాదూ? ఇల్లాంటి విశ్వవిఖ్యాత కట్టడాలను గురించి ఎంతెంతో విని ఏమేమో ఊహించుకుని వస్తే ఇలాంటి నిరాశ తప్పదేమో!

తాజ్‌మహల్ కలిగించిన నిరుత్సాహాన్ని పటాపంచలు చేసింది ఫతేపూర్ సిక్రీ. ఆ పాడుపెట్టిన మహానగరం గురించి అంతకుముందు సరళకు తెలిసింది తక్కువ. అంచేత ఒక్కసారిగా ఆ కట్టడాలు కళ్ళముందు నిలవగానే నిశ్చేష్టురాలయింది. ఎన్నోసార్లు తన మారుతీలో వచ్చి వుంటాడు– ప్రభాకర్‌కు ఆ భవనాలు కట్టడాలు కొట్టిన పిండి అనిపించింది. బులంద్ దర్వాజా గురించి, పంచ మహల్ గురించి, సలీం ఛిస్తీ దర్గా గురించి, దీన్ ఇలాహీ ప్రవచించిన సమావేశ స్థలం గురించి, తాన్‌సేన్ పాడడం కోసం నిర్మించిన వేదిక గురించి, బీర్బల్, మాన్‌సింగ్, తోడర్‌మల్, జోధాబాయ్‌ల గురించి చక్కని భాషలో అనుభవజ్ఞుడైన గైడ్‌లా వివరించాడు ప్రభాకర్.

"ప్రభాకర్. మా సరళకు మన కంప్యూటర్ సెంటర్‌లో ఉద్యోగం దొరికే అవకాశం వుందా? తిన్నగా ఉద్యోగమే అంటే కష్టమవవచ్చు గానీ గవర్నమెంటు వాళ్ళ అప్రెంటిస్ పథకం కింద ఏడాదిపాటు గ్రాడ్యుయేట్లకు శిక్షణ నిచ్చే ఏర్పాటు వుంది కదా. అదయినా బావుంటుంది. మనలాంటి కంపెనీలో ఏడాదిపాటు పనిచేస్తే ఆ అనుభవం బాగా ఉపయోగపడుతుంది. మన కంప్యూటర్ సెంటరు మానేజరు మీ బాసే కదా.. ఓసారి కదిపి చూడగూడదూ.." తిరుగు ప్రయాణంలో ప్రస్తావించాడు రమేష్.

అయితే ప్రభాకర్ కూడా బావా వాళ్ళ కంపెనీ ఉద్యోగేనన్నమాట. ఆఫీసు అయిన తర్వాత ఇలా మారుతీ నడపడం.. మంచి లాభసాటి బేరమే! బావుంది. అయినా బావకు మరీ మంచీ చెడ్డా తెలియవు. కంప్యూటర్లలో డిగ్రీ పుచ్చుకున్న తనకు ప్రభాకర్‌లాంటివాళ్ళు సిఫార్సు చేయడమా.. ఏమో! బాసుల దగ్గర ఆంతరంగిక కార్యదర్శులకు ప్రభాకర్‌లాంటి వాళ్ళకు వున్న పలుకుబడి బావలాంటి సహోద్యోగులకుండదేమో.. ఆలోచనలో పడింది సరళ.

సరిగ్గా పదిగంటలకల్లా ఇంటికి చేరారు. అయిదు వందల కిలోమీటర్లు ఒక్కరోజులో తిరిగి రావడం వల్ల అలసిపోయారంతా.

"ప్రభాకర్.. ఎంతా?"

"అయిదువందల ముప్పైఆరు కిలోమీటర్లు. పదకొండు వందలివ్వండి.."

చెల్లింపులయ్యాయి. ఒక్కరోజులో ఖర్చులుపోను కనీసం ఐదారు వందలైనా మిగిలివుండదూ? ప్రభాకర్‌ను చూస్తే అసూయ అనిపించింది సరళకు. ఎందుకీ చదువులూ చట్టుబండలూ? హాయిగా మారుతీ నడువుకుంటే పోలా?! విదేశాల్లో ప్రొఫెసర్లు సైతం పాఠాలు చెప్పడం మానేసి టాక్సీలు నడుపుకుంటున్నారన్న వార్తలు విని అతి

# మంచినీళ్ళప్రాయంగా మనిషి ప్రాణంతీయగల అమ్మాయిలు!

శ్రీలంకలోని తమిళ టైగర్లు 'బ్లాక్ టైగ్రెసెస్' అనే ఒక దళాన్ని ఏర్పాటుచేశారు. అందులో మూడువేలమంది అమ్మాయిలున్నారు. అందరూ టీనేజర్లే. చంపమన్నవారిని నిర్దయగా చంపడం వారికి నేర్పించే మొదటి అంశం. అందుకోసం అన్నిరకాల ఆయుధాలను ఉపయోగించడంలో శిక్షణ ఇస్తారు. సిగరెట్స్, సెక్స్, మద్యం, జూదం పూర్తిగా నిషిద్ధం. సంవత్సరంలో ఒక్కసారే ఇళ్ళకు వెళ్ళడానికి అనుమతిస్తారు. పట్టుబడితే తక్షణం ఆత్మహత్య చేసుకోవడానికి వీలుగా ప్రతి అమ్మాయికీ సైనైడ్ పిల్ ఇస్తారు. రాజీవ్ గాంధీని చంపిన థాను ఈ దళ సభ్యురాలే. ఈ దళంవాళ్ళు ఇంకా ఒక శ్రీలంక అధ్యక్షుడినీ, అధ్యక్ష స్థానానికి పోటీచేసిన ఇద్దరు అభ్యర్థులను, ఒక రక్షణ మంత్రినీ, సైనికాధిపతులను కూడా చంపారు. ప్రత్యేక రాష్ట్రం కోసం శ్రీలంక తమిళులు 1980లలో మొదలెట్టిన అంతర్యుద్ధంలో భాగంగా ఇవన్నీ చేశారు.

–ఎం.లిపి

శయోక్తి అనుకుంది తాను. చూస్తుంటే అదే తెలివయిన పని అనిపిస్తోంది...

* * *

"సుజాతా.. మన సుబ్బారావుగారి పేరెంట్స్ ఇవాళ జీటీలో వెళుతున్నారట. ఓసారి వెళ్ళి పలకరించి వస్తే బావుండదూ.." ఆఫీసు నుంచి రాగానే ప్రతిపాదించాడు రమేష్.

"తప్పకుండా వెళదాం.. సరళా నువ్వూ రా.. ఉష తెలుసు కదా- వాళ్ళ అమ్మావాళ్ళు. ఆ పక్క బ్లాక్‌లోనే.."

అంతా కలిసి వెళ్ళారు.

మనుషుల కన్నా ముందే ప్రభాకర్ మారుతీ కనిపించి పలకరించింది సరళను. ఆగ్రా అంతా తిరిగిరావడంతో ఆ మారుతీ అంటే చనువు అనిపించేస్తోంది!

లోపల సుబ్బారావు, ప్రభాకర్ కబుర్లాడుతూ సామాను పాక్ చేస్తున్నారు. తానూ ఓ చెయ్యి వేశాడు రమేష్.

"ఎలా వుందీ మా ఢిల్లీ.. ఆగ్రా అలసట తీరిందా?" నవ్వుతూ సరళను పలకరించాడు ప్రభాకర్.

ఆ నవ్వు అంతగా రుచించలేదు. "బావుంది. మన ఢిల్లీ" అంది- మన అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

"అవునవును. మీకు ఇక్కడ ఉద్యోగం దొరికితే మా ఢిల్లీ కాస్త మన ఢిల్లీ అయిపోతుంది" గలగలా నవ్వాడు ప్రభాకర్. "అన్నట్టు మీరు డిగ్రీ ఎక్కడ చేశారు? ఫస్ట్‌క్లాసేనా? పర్సంటేజి ఎంతా?"

ఒళ్ళుమండింది సరళకు. ఎందుకా అనవసరపు కుతూహలం?!

అయినా వివరాలు చెప్పకుండా వుండలేకపోయింది. "మీరు డిగ్రీ ఎక్కడ చదివారూ?"




అనుకోకుండా అడిగేసింది.

"నేనా? డిగ్రీనా! అబ్బే.. నేనసలెప్పుడూ డిగ్రీ పుచ్చుకోలేదు" అదే నవ్వుతో సమాధానం చెప్పాడు. తన ప్రశ్న అతనిని నొప్పించిందా? లేనట్టే అనిపిస్తోంది. అయినా ఆ మాట అడగకుండా వుండవలసింది.

వీడ్కోలు చెప్పడానికి మరో నాలుగు కుటుంబాలవారు వచ్చారు. వాళ్ళల్లో కనబడుతోన్న స్నేహ భావం, ఐకమత్యం ముచ్చట కలిగించాయి సరళకు. తెలుగు గడ్డకు దూరాన వుంటున్నారు గాబట్టి ఈ ప్రేమాభిమానాలు.. అదే ఆంధ్ర దేశంలో వున్నట్టయితే అసలు ఒకళ్ళ ఉనికి మరొకరు పట్టించుకునేవారు గాదేమో.. పట్టించుకోకపోగా ప్రాంతాలూ, కులాలూ అంటూ గిరులు గీసుకుని బతికేవారేమో!

కారులో సామాన్లు సర్దడమయిపోయింది.



సుబ్బారావుగారినీ, ఆయన తల్లిదండ్రుల్నీ ఎక్కించుకుని మారుతీని ముందుకు ఉరికించాడు ప్రభాకర్. 'ఈ సాయంత్రం మరో అరవై రూపాయలు సంపాదించేస్తాడన్నమాట'- అనుకోకుండా వుండలేకపోయింది సరళ.

"సరళా.. కంగ్రాట్స్.. మా కంపెనీలో ఎప్రెంటిస్‌గా తీసుకున్నారు నిన్ను. రేపట్నుంచీ వెళ్ళాలి" సంతోషంగా ప్రకటించాడు రమేష్.

నమ్మలేకపోయింది సరళ. యథాలాపంగా మొదలుపెట్టిన తన ఉద్యోగ ప్రయత్నం ఇంత త్వరగా ఫలిస్తుందనుకోలేదు. ఆ ప్రభాకర్ బయోడేటా, అప్లికేషన్ అడిగి పట్టుకెళితే 'ఇ ఇదేవన్నా వచ్చేదా పాడా' అనుకుంటూ ఇచ్చింది. పైగా 'బావా, నువ్వూ కొంచెం ప్రయత్నించు' అంటే 'ఆ అవసరముండదులే' అని తేలిగ్గా తీసిపారేశాడు రమేష్. అసలీ అవకాశం వస్తుందనుకోలేదు.

"థాంక్స్ బావా. మీకో మంచి పార్టీ ఇస్తాను.."

"మాకు కాదు. ముందు ప్రభాకర్‌కు ఇవ్వాలి."

ప్రాణం చివుక్కుమంది సరళకు. తన ఉద్యోగం ప్రభాకర్ సిఫారసు ఫలితమా?!

"మరీ రేపేనా చేరడం? పాపం మొన్నటిదాకా పరీక్షలూ చదువులూ అని నానా హైరానా పడింది. కనీసం నెలరోజులపాటు నీడపట్టున వుండి దాన్ని కాస్తంత ఊపిరి సలుపుకోనివ్వరాదా.." అంది సుజాత.

"చూడవోయ్. ఉద్యోగమంటే ఆడుతూ పాడుతూ ఆవకాయ పెట్టుకోవడం కాదు. అసలు మా కంపెనీలో పనంటే ఎగిరి గంతెయ్యాల్సింది పోయి ఏవిటా సన్నాయి నొక్కులూ" మందలించాడు రమేష్.

మూతి ముడిచింది సుజాత.

ఏదెలా వున్నా ఆ క్షణమే వెళ్ళి ఉద్యోగంలో చేరిపోవాలనిపించింది సరళకు.

* * *

"ఎలా వుందీ మొదటిరోజు అనుభవం.." ఆ సాయంత్రం అలసిపోయి ఇంటికొచ్చిన చెల్లెల్ని పరామర్శించింది సుజాత.

ఖస్సుమంది సరళ. "నువ్వూ బావా కలిసి ఇంత మోసం చేస్తారా?"

తెల్లబోయింది సుజాత. "ఏమయిందే?"

"ఇంకా ఏం జరగాలీ? కొంప మునిగింది. తెలిసీ తెలియక ఈ పదిహేను రోజులూ ఎన్ని అవాకులూ చెవాకులూ పేలానో! ఎన్ని నిరసన చూపులు చూశానో.." ఎర్రబడిన మొహంతో ఉక్రోషంతో భళ్ళుమనడానికి సిద్ధమవుతూ అన్నది సరళ.

"ఏమిటే ఆ తలాతోకా లేని మాటలూ? సరిగ్గా చెప్పు"

"పొద్దున ఉద్యోగంలో చేరడానికి కంప్యూటర్ సెంటర్‌కు వెళ్ళానా.. అక్కడ మానేజరుగారి గదిలో ప్రభాకర్ వున్నారు. కూర్చోమని కుర్చీ చూపించారు మానేజరు. అతని పక్కన కూర్చో

వడమా అని బెరుకు బెరుగ్గా కూర్చున్నాను. సరళగారూ.. ప్రభాకర్ తెలుసు గదా.. మీ తెలుగువారే.. ఆయన దగ్గర మీరీ ఏడాదంతా పనిచేయవలసి వుంటుంది. అది మీ అదృష్టం– అన్నారు మా మానేజరు. అది విని నా మతి పోయింది.."

విషయం లీలగా బోధపడుతున్నట్టనిపించింది సుజాతకు.

"... మతిలేనిదానిలా ప్రభాకర్ వెంట వెళ్ళాను. చకచకా ఆయన అన్ని సంగతులూ వివరించారు. ఈ ఏడాదిలో నేను ఏమేమి నేర్చుకోవాలో ఏమేమి పనులు చేయాలో స్పష్టంగా చెప్పారు. తర్వాత పక్క వాళ్ళను అడిగితే అర్థమయింది ఆయన మా కంప్యూటర్ సెంటర్లో నెంబర్ టూ అని..." చెప్ప కొచ్చింది సరళ.

"మరి ఇన్ని రోజులబట్టీ అతన్ని కలుసుకుంటూనే వున్నావు.. నీ ఉద్యోగం గురించి మాట్లాడుతున్నాం.. నీకు ఆ మాత్రం తట్టలేదా? అంత మట్టి బుర్రేవిటే నీదీ.." ఆశ్చర్యం, మందలింపూ మేళవించి అంది సుజాత.

"అనమ్మా.. నన్నే అను. నాకేం తెలుసూ. ఆ మారుతీకారూ ఆ హడావుడీ చూసి కంపెనీలో డ్రైవరేమో అనుకున్నాను. పైగా మొన్న ఆయన డిగ్రీ ఎప్పుడూ చదవలేదన్నారు గదా.." ఇంకా సందేహాలు తీరలేదు సరళకు.

"ఓ... అదా.. నిజమే. ప్రభాకర్ డిగ్రీ చదవని మాట నిజమే. కంప్యూటర్లలో పాలిటెక్నిక్ డిప్లొమో చేసి ఇక్కడ చేరారు. వెంటనే ఎఎంఐఇ కట్టి పాసయ్యారు. అయిదేళ్ళు తిరగకుండానే ఆఫీసరయిపోయారు. డిగ్రీలున్నవాళ్ళకన్నా చురుగ్గా ప్రమోషన్లు సంపాదిస్తున్నారు. అసలదంతా ఎందుకూ.. ఒకప్పుడు మీ బావా ఆయనా ఒకే స్థాయిలో వుండేవారు. ఇప్పుడు ప్రభాకర్ రెండేళ్ళు సీనియర్ అయ్యారు" వివరించింది సుజాత.

"మరి ఆ మారుతీని టాక్సీలా నడిపి డబ్బులు సంపాదించడం.. ఏం ఖర్మా?!"

"నేను చెబుతాను" అప్పుడే వచ్చిన రమేష్ అందుకున్నాడు "అది ఖర్మ కాదు. మనమంతా చేసుకున్న పుణ్యం. ప్రభాకర్ ఓ విశిష్ట వ్యక్తి. ఆ మారుతీతో డబ్బులు సంపాదిస్తున్న మాట నిజమే. ఒకరకంగా అది చట్టవిరుద్ధమే. కానీ ఆ సంపాదన వెనుక ఓ చక్కని భావన వుంది. అతన్ని చూస్తే ఒక్కోసారి మాకంతా గర్వంగా వుంటుంది. ఒక్కోసారి మేమూ అలాంటి పనులు ఎందుకు చేయలేకపోతున్నామా అని సిగ్గనిపిస్తుంది.." కొనసాగించాడు రమేష్.

"ఆంధ్రదేశంలో నాలుగుమూలలా ప్రభాకర్‌కు ఓ అనూహ్యమైన మిత్రబృందముంది. గతమెంతో ఘనకీర్తి కలిగి, ప్రస్తుతం ఆర్థిక వసతి లేక ఇబ్బందులు పడుతున్న కవులూ కళాకారులూ ఆ మిత్ర బృందంలో సభ్యులు. వాళ్ళందరికీ నెలనెలా తలా ఓ రెండు మూడు వందలు పంపుతూ వుంటాడు ప్రభాకర్. ఒకరకంగా చెప్పాలంటే వాళ్ళ పోషణ బాధ్యత తనమీద పెట్టుకున్నాడన్నమాట. ఏమిటా మితిమీరిన ఆదర్శవాదం అంటే– ఇందులో ఆదర్శమేముందీ? సాయంత్రాలు, సెలవురోజులూ మీలాంటివాళ్ళతో సరదాగా గడుపుతున్నా. ఆ ప్రయత్నంగా వస్తున్న ఆ ఆదాయాన్ని నాకు తోచిన పనికోసం ఖర్చుపెడుతున్నా– అంటాడు.." రమేష్ గొంతులో సరదా ధోరణి పోయి కించిత్తు ఆరాధనాభావం చోటు చేసుకున్నది.

అవాక్కయింది సరళ. తను అనుకున్నదానికీ నిజానికీ ఎంత తేడా?! తన ఊహాగానంలో తన తేలికతనమే బయటపడలేదూ?! ఎంత పొరపాటు జరిగిపోయిందీ!

"రోజంతా ఆయన మొహంలోకి చూడలేకపోయాను. ఇదంతా వింటోంటే ఇంకా సిగ్గనిపిస్తోంది. అసలిప్పుడు ఆయన ముందుకు ఎలా వెళ్ళాలో తెలియడంలేదు" సుడులు తిరుగుతున్న కన్నీళ్ళను కష్టంమీద ఆపుకుంటూ అంది సరళ.

"మరేం ఫర్లేదు. ఆయనా విషయం గ్రహించాడనుకోను. ఒకవేళ గ్రహించినా ఇలాంటివాటిని పట్టించుకునే బాపతు కాదు. బెంగపెట్టుకోక. నీకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా మా క్లబ్‌లో మాంచి డిన్నర్ పార్టీ ఏర్పాటుచేశాను. ప్రభాకర్, సుబ్బారావ్, ఉష వస్తున్నారు. ఏర్పాట్లన్నీ గ్రాండ్‌గా చేశాం. బిల్లు మాత్రం నీదేనమ్మాయ్.." హుషారుగా దారితీశాడు రమేష్.

# మారాకు తొడగని మనిషి

కాలికింత నేలైనా తగలని నీటిమీద శ్వాసిస్తున్నాను. ఎంతో కొంత మట్టి కావాలి నువ్విస్తావా ఓ పది తులాల మట్టి పొట్లాం కట్టిస్తావా?– ఒక్క మొక్కైనా మొలవని యింతింత నీళ్ళతో నాకే పనీ లేదు.

భూమి గుండె పగిలి నీరైందనే పాత మాటే నేననేది గాలంతా అయి పోయింది. ఓ OXY-CARE కొనిపెట్టండ్రా హృద్రోగం అంచున నిలబడ్డాను. నేలంతా నీరవుతోంది ఎవడైనా ఆపండ్రా

వాడనీ, తరగనీ, తగ్గనీ అంతా అయిపోతూనే... అయిపోబోతూనే వుంది. రెండాకులుగా తొడిగే మన్నే కావాలికనుంచి.

నేనే నేలనై మొలవాలి
నేనే మట్టినై పుట్టాలి
రా! రారా!! రారా రా



లేత కళ్ళ పసిపిల్లలంతా మంచినీటి మేఘాలయితే
నేను గింజ మొలిచే మట్టినవుతా

ఇప్పుడేదిస్తే ఉన్న కాస్త భూమీ నీరవుద్దని దుఃఖాన్ని ఆపేశాను
ఇకనుంచి కళ్ళలోంచి ఆమ్లవర్షమే...!

–సీతారాం